# నవ్విన అన్నపూర్ణ

అప్పటికి నాకు పదిహేడేళ్లు వుంటాయి. నా పరాళ్లలాటి పల్లెటూరు బడుల్లో చదువు అంత మంచిది కాదన్న వుద్దేశంతో స్కూలు ఫైనలు చదివించడానికి మా నాన్న నన్ను బెజవాడ పంపాడు. అక్కడే మా మామయ్యకు సొంతయిల్లు వున్నది. నన్ను తీసుకొని మా మేనమామ సరాసరి హెడ్ మాస్టరుగారి గదిలోకి వెళ్లి, ఇంగ్లీషులో అరగంట తర్జనభర్జనలు జరిపాడు. హెడ్ మాస్టరుగారు నా మార్కులలిస్టు చూచి ససేమిరా వీణ్ని మా స్కూల్లో చేర్చుకోనని అన్నారు. అయినా మామామయ్యకు యేవిషయమైనా కొసావరకూ లాగి ప్రయత్నించే అలవాటు వున్న కారణంచేత నన్ను బళ్లోచేర్చుకోక తప్పదనీ, వెనక నేను చదివింది పల్లెటూరి బడి అనీన్నీ, అందులోని మాస్టర్లంతా రోజుకు యిరవైమూడు గంటల ముప్పైమూడు నిమిషాలు డబ్బుసంపాదన తాపత్రయంలోనో, ట్రాన్స్ఫర్ల గొడవల్లోనో కుత్తుకలోతున దిగబడివుంటారని, తత్కారణంచేత మార్కులు తక్కువరావడం సహజమనీ, కనుక నన్ను బళ్లో చేర్చుకోక పంపెయ్యడానికి అది అంత పెద్దకారణం కాదనీ వాదించి, చింతాకుకొమ్మన మిఠాయిపొట్లంలా కూచున్న హెడ్ మాస్టారిని ఒప్పించేటప్పటికి బ్రహ్మరుద్రుణ్ని దింపినట్లయింది. హెడ్ మాస్టారు నావంక తిరిగి గోటు సిక్స్త్ఫారం, 'ఏ' అని అన్నారు. ఆ వయస్సును బట్టి మా హెడ్ మాస్టారి మాటల్లో యింద్రపదవి ఏదో నాముందుదొర్లినట్లయింది. వెనుక వచ్చిన బ్లాకు మార్కుల్ని యీ దెబ్బతో తుడిచేసుకొని, "పాపం, వీడు బాగానే చదువుతాడు. నేనే వృథాగా అనుమానించానని హెడ్ మాస్టారు అనుకోవాలె" అని ఆలోచించుకొంటూ తలవంచుకు నడుస్తూన్న నేను ఎదురుగావస్తూన్న ఆవాలుకళ్లమ్మాయిని చూడనేలేదు...జరగవలసినపని కాస్తాజరిగిపోయింది. ఆ పిల్ల పుస్తకాలన్నీ చెల్లాచెదురుగా వరండా. అంతా విరజిమ్మినట్లు పడిపోయాయి. కంపాసు బాక్సులోని పరికరాలు హెడ్ మాస్టరుగారి గదిముందుపడి, ఘొల్లుమని ఆనారీ రత్నానికి జరిగిన అవమానాన్ని తెగేసి చెప్పినాయి.

ఇట్టివి యింతకు పూర్వము ఎప్పుడూ నా అనుభవంలోకి రాలేదు. ఏం చేయాలో తోచక బిక్కమొహంవేసి బెరుగ్గాముందుకు చూశాను. అప్పటికే ఆ పిల్ల పుస్తకాలనీ కంపాసు బాక్సునీ ఏరుకొని అసలు ఏమీ జరగనట్లుగా నాకేసి కొంటిగా నవ్వుతో వెళ్లిపోతోంది. బంట్రోతు ఒకడు కోరగాచూస్తూ, పెదవుల్లోపల యికిలిస్తూ, బుజాన్ని రాసుకొని అటుపోయాడు. గుండెఝల్లుమంది. హెడ్ మాస్టారు పిలుస్తారేమోనని పదినిముషాలు చూసి, ముప్పైమూడు గదులుకల ఆ విశాలభవనంలో నేను ఒక సంవత్సరమంతా గడపవలసిన గది వెతుక్కొంటూ పోయాను.

పదినిమిషాలు తిరగంగా సిక్స్త్ ఫారం 'ఏ' కనిపించింది. వెండికట్టువేసిన సులోచనాల్లోంచి, అప్పుడప్పుడు జరిగే సాదావిప్లవాల్ని కడకంట నివారిస్తూ, టేబులుకు ప్రక్కగా బ్లాకుబోర్డుకేసి తిరిగి, కుడిచేతిలోని చూపుడు కఱ్ఱతో బ్లాకుబోర్డుకు వేలాడ తీసిన అంచులు శుష్కించిన ఐరోపా ఖండపు మ్యాపు చూపిస్తూ, యింటి దగ్గిర చదువుకొచ్చిన ఖండాంతర పరిస్థితుల్ని అనర్గళంగా వప్పచెప్పుతూన్న జాగ్రఫీ మేష్టార్నిచూసి, లోపలికి అడుగుపెట్టడానికి గుండె చాలక తలుపు ప్రక్కకొదిగి నిలబడ్డ నేను, నావంక కొంటెగా నవ్వుతో, ముక్కు ఎగరేస్తున్న వాలు కళ్లమ్మాయిని చూశాను. ఒక్కసారిగా ముచ్చెమటలు పోశాయి. ఒక్కటొక్కటే క్లాసులోని అందరి దృష్టులూ, నామీదపడి, నానుంచి భూగోళం మేష్టారి కళ్లద్దాలమీదపడి, వాలుకళ్లమ్మాయిమీద కొంతసేపునిలిచి అక్కడనుంచి క్లాసంతా కలగా పుల

గంగా ప్రతిఫలించసాగాయి. ఇట్టివిషయాలను కనిపెట్టడంలో కాకలు దీరిన మేష్టారు నాకేసితిరిగి, "ఎవరోయి, ధీమంతుడా? గదిబయట తాచ్చారం, చేస్తున్నా"వని పలుకరించారు. పిల్లలు నవ్వులోకి వుపక్రమించారు. వాలు కళ్లమ్మాయి పుస్తకంలో మొగం దాచుకొని పగలబడి నవ్వుతోంది. ఎల్లాగైతేనేం, తెప్పరించుకొని "నేనాండి, క్రొత్తవాణ్నండి" అని అన్నాను. ఆ అనడంలో గ్రహబలం చాలక నోరు జారి కొత్తవాణ్ని అనడానికి బదులు కోతివాణ్ని అని వచ్చింది. మేష్టారూ పిల్లలూ అందరూ ఒక్కసారి నవ్వేరు. ఆ నవ్వుల్లోనే క్లాసులోకి రమ్మనమని మేష్టారు అనుజ్ఞయిచ్చారు. నవ్వులు అయిదు నిమిషాలదాకా చల్లారలేదు. వాలు కళ్లమ్మాయి మరీను. పుస్తకంలో మొహందాచుకునిబుగ్గలు యెఱ్ఱపడేటట్లు ఒకటే నవ్వు.

ఆ రోజంతా అట్లానే గడిచిపోయింది. "తన వెంటన్ సిరి, లచ్చివెంటనవరోధ వ్రాతమున్నట్లు" ఆ కొంటెపిల్ల కళ్లతో బుగ్గలతో నవ్వడం, ఆమె స్నేహితురాండ్రు పెదవులు కదిలించటం, సోదర విద్యార్థులు పకాలున నవ్వడం, ఇంతలో యేమూలనుంచో కోతి వాడు అని యెవడో కీచుగొంతుతో రాగాలాపన చేయడం, నేనుపళ్లు బిగబట్టి తలవంచుకోడంతో ఆ రోజు ఒకయుగంలాగడిచింది. నా మనస్సులోక్షోభ ఎవరితో చెప్పుకోవాలి. అంతా కొత్తవాళ్లు. వాళ్లకి నేను కోతివాణ్ని. అప్పుడే ప్రొద్దున్న జరిగిన పని తారాజువ్వలా కుఱ్ఱాళ్ల బుఱ్ఱల్లోకి పాకిపోయిందేమో, ఆ పిల్లనూ నన్ను రెట్టించి చూడ్డం మొదలెట్టారు. లాంగుబెల్లు కొట్టారు. ఎవళ్ల దారిన వాళ్లు పోతున్నారు. నేను ఒక్కణ్ని తలవంచుకుని పుస్తకాల సంచీ బుజాన్నతగిలించుకొని, ఎన్ని ప్రమాదాలొచ్చినా, విడవకుండా నన్ను సేవిస్తున్న మా కీలు గుఱ్ఱంసైకిల్ని సమీపించేటప్పటికి నా మనస్సును అంగుళంన్నర లోతున కోసేసిన సంఘటన ఒకటి చూడవలసి వచ్చింది. ముందుచక్రం టైరు మూడు అంగుళాల పొడుగున కోయబడింది. మనస్సు క్రోధంతో వుడికిపోయింది.

తనకంటె రెండేళ్లు చిన్నదిగా కనిపించే చిన్నదాన్ని ఒకతెను తనవెంట తీసుకెడుతూ, ఏటిగాలికి మొగలి రేకులు శబ్దంచేసికొన్నట్లు, "చూశావుటే కోతిగార్ని" అని ఆవాలు కళ్లమ్మాయి అంది. ఇంకవుండబట్టలేకపోయాను. నిక్షేపంగా స్కూల్లో చేరుదామని వచ్చిన నేను, కాస్తమంచి స్వభావంకలవాణ్ని కాబట్టి, వరండాలో తలవంచుకు పోతూంటే, ఎదురుగా నడుస్తూన్న ఆపిల్ల నన్నుగుద్దుకొని తెగనవ్వబట్టేకదా యీ పిల్లలికి ఇంత లోకువ అయ్యాను. అల్లానవ్వడమెందుకు? పెద్దతెలివైనదానిలా ఆ కళ్లతోటే బుగ్గలతోటే కనీకనిపించకుండా అంత,సుతారంగా నవ్వవలసిన అవసరమేమిటి?

"ఏయ్, పిల్లా యేమిట్లా నవ్వుతావు? "

"ఎవరు నవ్వారమ్మా"

"నువ్వే"

"ఎవరికేసి ? "

"నాకేసే"

"నిన్ను చూసి నేనెందుకు నవ్వుతాను. "

"ఎందుకు నవ్వుతావో, ఇకముందు అల్లాంటి పన్లు చేయి, తెలుస్తుంది. మూర్తి అంటే యెరగవులే" అంతవరకూ నవ్వుతూన్న వాలు కళ్లపిల్ల విశాల నేత్రాలు ఎఱ్ఱ బడ్డాయి. బుగ్గలు లేతమందారాలువూచాయి. పెదవులు శీతగాలికి చలించే తామర మొగ్గలయాయి. ఆ విశాలనేత్రాల్లోంచి ముత్యాల్లా కన్నీళ్లు, బొట్టు బొట్టుగా శరత్కౌముదీ సుందరమైన, తత్కపోలాలమీదా మెరసిపోతున్నాయి. ఆ విశాల భవనంలో, ఆమె, నేనూ, ఆ పిల్లతోవున్న ఆ రెండో అమ్మాయి తప్ప అందరూ వెళ్లిపోయారు. అంత కోపమూ ఎక్కడికిపోయిందో, మనస్సంతా జాలితో నిండిపోయింది. ఎన్నో ఓదార్పుమాటలన్నాను. ఎన్ని విధాలుగానో బ్రతిమాలుకొన్నాను. ఇంకా యేడుస్తూనేవుంది.

"ఊరుకోవూ ? "

"ఏం వూరుకోంటుంది. అన్నిమాటలంటే ఎవరు మాత్రం ఏడవకుండా వుంటారు." సీమపచ్చిమిరపకాయలా అందుకొన్నది రెండోచిన్నది.

"అదికాదులే, అమ్మాయి, ఏదోమీకంటే పెద్దవాణ్ని కాదూ! కొంచెం కోపమొచ్చింది కనుక అల్లాగ అన్నాను. ఎప్పుడూ కోప్పడతానా? మూర్తి అంటే చాలా జాలి గుండె కలవాడని మా వూళ్లో ఎవర్ని అడిగినా చెప్పతారు. నీవు వూరుకోకపోతే, నాకూ ఏడుపొస్తుంది. పోనీ; నేను ఏడవనా ?"

......కు నవ్వువచ్చింది. వానవెలిశాక వచ్చే చంద్రకిరణాలకంటె లక్షరెట్లు గొప్పదిగా కనిపించింది ఆ చిరునవ్వు. ఒకసారి ఆ కళ్లను తుడవాలనిపించింది. పరస్త్రీని, ప్రేమహృదయంతో, ఒంటరిగా స్పృశించడం అదేమొదటిసారి. ఆమె ఒడలంతా ఒక్కసారి పులకించిందేమొ!.........

"బావా, యింకెప్పుడూ కోప్పడవు కాదూ?"

"బావా, బావ ఎవరు?"

"ఇంకెవరయ్యా, నువ్వే వున్నవాడివి. మేమెందుకు గుర్తుండాలి" పక్కుమంది రెండోది.

"కాదులే బావా, మామయ్యకు మా నాన్న పినతండ్రి కొడుకు. ఇదివరకే మా నాన్నతో మామయ్య చెప్పాడు, నిన్ను బస్తీకి తీసుకొస్తానని. ఇవాళ మామయ్యవెంటనున్న నిన్ను పోల్చుకొన్నాను. ఆయనే పరిచయంచేసేవాడు. కాని పనితొందరమీద వెళ్లిపోయాడు. వరండాలో ఆ పని జరిగాక మాబావగారి బుద్ధికుశలతకు నవ్వువచ్చింది. ఇది మా చెల్లి" ఎవళ్లదారిన వాళ్లు వెళ్లిపోయాము. నా హృదయం ఎల్లావుంటుందో రసజ్ఞులకే తెలియాలి.

ఇంతవరకూ వ్రాశాక యికయేమివ్రాయాలో తోచటంలేదు. పళ్లసందున కలం మొనయిరికించి ఆలోచిస్తున్నాను. ఎప్పుడొచ్చిందో మా యింటావిడ వెనక నిలబడివుంది.

"ఎప్పుడనంగా తెచ్చానండీ, కాఫీ చప్పగా చల్లారిపోతోంది. అయినా ఏళ్లుపైబడ్డకొద్దీ యిదేం రాతలండీ?"

అన్నపూర్ణ చూడనే చూశింది.

"తప్పేముంది, జ్ఞాపకమొచ్చింది గనుక వ్రాశాను, జరగని సంగతా ?"

"వూరుకోండి, ఇటువంటి విషయాలు వూళ్లో వాళ్లకి చెప్పుకొంటారుటండీ"..........

ఇప్పటికి ఆరేళ్లబట్టీ ఆమె నాతో కాపురం చేస్తోంది. ఇద్దరు పిల్లల తల్లిఅయింది. ఆవాలుంకళ్లలోని వెనకటి చిలిపితనాన్ని మాతృభావనలు ముంచివేశాయి. నా జీవితాకాశంలోని ప్రత్యణువునూ స్పృశించి పులకింపచేస్తున్న తదీయ చాంద్రమసీదృక్కులలో నాఅధైర్యాన్ని దాచుకోలేను. కిటికిలోంచి బయటకు చూశాను.

---

శ్రీ కే. యన్. కేసరి గారికి.

మాననీయా! వందనములు

తాము పంపిన గృహలక్ష్మి జయంత్యుత్సవాహ్వానమును అత్యానందభరితుడనై వందన పూర్వకముగా నందికొంటిని.

కేసరీ! నరకేసరీ!! తమకేసరి—

స్త్రీజనోద్ధరణమునకై గృహలక్ష్మి స్వర్ణ కంకణ

ప్రదాతలై గృహలక్ష్ముల నేటేట ప్రోత్సహించుట,

ఊటలూరే కవితా మాధురీ ఝరి నోలలాడించే "శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ"గారి వత్సరమున స్వర్ణకంకణ గృహీతలగుట మిక్కిలి ప్రశంసనీయము.

సేవకుడు, పోలాకి శ్రీనివాసరావు.

"తెలుగు బోధిని గ్రంథకర్త" బూరవల్లి